సాక్షి సంగారెడ్డి

శనివారం । 13 । జనవరి । 2024



న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న తెంకటి కుమార్

నారాయణఖేడ్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖేడ్ ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కన్వీనర్ తెంకటి కుమార్ మాట్లాడుతూ.. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతిగృహాల మెస్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తూ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పవన్, అనిల్, మహిపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి


రైతుకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వట్‌పల్లి(అందోల్): పంట మార్పిడి విధానంతో అధిక దిగుడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి విజయరత్న అన్నారు. శుక్రవారం అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్‌లో వరి పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కాండం తొలుచు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగు ఉధృతిని తగ్గించేందుకు ఎకరానికి కేజీ కార్బోఫిరాన్ గుళికలను పిచికారీ చేయాలని సూచించారు. నాటు వేసే ముందు ఆకు చివరి భాగాన్ని కత్తిరించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు అనిత, శ్రీనివాస్, లక్ష్మీకాంత్, రైతులు గోపాల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

90 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం బస్తాలు, వాహనం

కల్హేర్(నారాయణఖేడ్): అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం వాటిని స్టేట్ విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. కల్హేర్ మండలం ఖానాపూర్(కె) ఎక్స్ రోడ్డు వద్ద గురువారం రాత్రి డీసీఎం వాహనం రోడ్డుపై దిగబడింది. అందులో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అందడంతో కంగ్టి సీఐ హన్మంతు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తనిఖీ చేపట్టి డ్రైవర్‌ను విచారించగా, మహారాష్ట్రకు బియ్యం తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. బియ్యం లోడుతో ఉన్న వాహనాన్ని కల్హేర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేట్ విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణచార్యులు, విజిలెన్స్ అధికారుల బృందం వాటిని స్వాధీనం చేసుకని ఖేడ్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ స్టేట్ తహసీల్దార్ ప్రభాకర్, విజిలెన్స్ ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, స్థానిక ఎస్ఐ వెంకటేశం, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు సాయి రవి, రాజుపటేల్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధి బీసీ కాలనీలోని 75 సర్వేనంబర్‌లో గల అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ ఆధ్వర్యంలో శుక్రవారం కూల్చివేయించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

• పండుగ.. బస్సులు నిండుగా

సంక్రాంతి పండుగ ప్రయాణం ప్రయాసగా మారింది. సొంతూళ్లకు వెళ్లే వారితో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. బస్సులో సీట్ల కోసం జనం పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్టీసీ ప్రత్యేకబస్సులు నడుపుతున్నా ప్రయాణికులకు సరిపోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రద్దీ పెరిగిందనే చర్చ సాగుతోంది. శుక్రవారం సంగారెడ్డి బస్టాండ్ ప్రయాణికులతో నిండిపోయింది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి


బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులు


కిక్కిరిసిన బస్సు


ఫుట్‌పాత్ పై వేలాడుతూ ప్రయాణం

వేతన వేదన!

- పండగపూట సమగ్ర శిక్ష ఉద్యోగులకు అందని జీతాలు
- జిల్లాలో 761 మంది ఎదురుచూపు
- భారంగా కుటుంబ పోషణ



సంక్రాంతి పండుగ వేళ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జీవితాల్లో చీకటి అలుముకుంది. రెండు నెలలుగా జీతాలు అందక వేదనకు గురవుతున్నారు. పండుగ సమయంలోనైనా వేతనాలు వస్తాయని ఎదురుచూసిన సిబ్బందికి నిరాశే ఎదురైంది.
– సంగారెడ్డి

జిల్లాలో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో 761 మంది పనిచేస్తున్నారు. వీరికి జీతాలు సరైన సమయంలో అందక కుటుంబ పోషణ భారంగా మారింది. జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల, జిల్లా విద్యాశాఖాధి కార్యాలయాలతో పాటు ఎయిడెడ్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలలు, మైనారిటీ గురుకులం, మండల రిసోర్సు కేంద్రం, ఆర్ట్, క్రాఫ్ట్, సీఆర్పీ తదితర 13 విభాగాల్లో 761 మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి నెలనెలా వేతనం రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, జిల్లా, మండల స్థాయిలలో ఎమ్మార్సీల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, భవిత కేంద్రాల్లో పనిచేసే ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్పీ)లు, కేర్గివింగ్ సిబ్బంది, సీఆర్పీలు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, మోడల్ స్కూళ్ల బాలికల వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వీరికి గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు అందలేదని ఆరోపిస్తున్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని గతేడాది 20 రోజులు సమ్మె చేశారు. సమ్మె డబ్బులే కాకుండా.. రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు.


సమ్మె చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

ఉద్యోగుల వివరాలు	
డీపీఓలు	10
కేజీబీవీ	410
ఎమ్మార్సీ విభాగంలో	120
సీఆర్‌పీలు	117
పీటీఐలు	116

రాష్ట్ర ప్రభుత్వ జాప్యంతో..

సమగ్ర శిక్ష అభియాన్ కింద పనిచేసే ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60– 40 శాతం విధానంలో నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం ఇప్పటికే తన వంతు వాటా చెల్లించినా, రాష్ట్రం తమ వాటా జమ చేయకపోవడంతోనే సమస్య వచ్చిందని ఉద్యోగులు చెబుతున్నారు. సమయానికి వేతనాలు అందక కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

వెంటనే విడుదల చేయాలి



నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు అందక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఇంటి అవసరాల కోసం అప్పులు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విడుదల చేయాలి.
– నాగరాజ్, సిస్టమ్ అనాలసిస్, డీఈఓ కార్యాలయం

అప్పు చేస్తున్నాం..



ప్రతినెలా వేతనం అందక ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, నిత్యావసరాల కోసం అప్పు చేయాల్సి వస్తుంది. ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనం చెల్లించేలా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తన వాటా వేయాలి.
– మరెల్లి దత్తు, సీఆర్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం నుంచి రాగానే..



రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు రాగానే జీతాలు చెల్లిస్తాం. జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. వీరికి వారం రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉంది. ఎవరూ ఆందోళన చెందవద్దు.
– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

రైతు ప్రయోజనాలకు పెద్దపీట

మాటూర్ శివారులో చక్కెర పరిశ్రమకు శంకుస్థాపనలో మంత్రి దామోదర


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్(అందోల్): రైతు ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని మాటూర్ గ్రామ శివారులో 'గోదావరి గంగ ఆగ్రో ప్రొడక్ట్స్ లిమిటెడ్' (చక్కెర పరిశ్రమ) శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్‌శెట్కార్, పంచగామ ఆశ్రమ పీఠాధిపతి కాశీనాథ్‌బాబాలతో ఫౌండేషన్ స్టోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటుతో 500 మందికి పరోక్షంగా.. 2,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వచ్చే అవకాశాలు వస్తాయని తెలిపారు. స్థానికులకు ప్రాధాన్యతనిచ్చి ఉద్యోగాలివ్వాలని పరిశ్రమ నిర్వాహకులకు సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం రాయితీ ఇవ్వడం తమ ప్రభుత్వ విధానంలో భాగమన్నారు. రాష్ట్రంలో మూతపడిన చక్కెర పరిశ్రమల సామర్థ్యం పెంపు, పునఃప్రారంభించడం, రైతుల ప్రయోజనాలు తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కెన్ కమిషనర్ పత్రు మల్హోత్ర, జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురి, సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీలు శివకుమార్ పాటిల్, పండరి, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీపీ మమత, మల్లికార్జున్ పాటిల్, అంజయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

మునిపల్లి(అందోల్): గ్రామాలు, పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ సావిత్రమ్మ రెండో కొడుకు వెంకటేశ్వర్‌రెడ్డి 13వ రోజు గుడిబియ్యాల కార్యక్రమంకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిపల్లి మోడల్ స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణ కోసం రూ.60 లక్షలు, తాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల అదనపు గదులతో పాటు పెండింగ్ పనుల కోసం రూ.30 లక్షలు, తాటిపల్లి గ్రామాభివృద్ధి కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాటిపల్లి రాంరెడ్డి, పద్మ, అంజిరెడ్డి, సతీష్ కుమార్, రసూల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధివినాయక జయంత్యుత్సవాలు


హోమం నిర్వహిస్తున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి రేజింతల్ గ్రామ శివారులోని సిద్ధి వినాయక ఆలయంలో శుక్రవారం జయంత్యుత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. వేకువజాము నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం స్వామి వారికి వేదఘోష, దీప ప్రజ్వలన, ధ్వజారోహణ, స్వస్తి పుణ్యాహవాచకం, అభిషేకం, దేవతా ఆహ్వానం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞ శాలలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ శెట్కార్ దంపతులు హాజరయ్యారు.

సంగారెడ్డిలో ఓటు నమోదుపై ర్యాలీ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు



పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

కలెక్టర్ వల్లూరు క్రాంతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్ : ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరిగేలా ప్రజా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈనెల 6న ఓటర్ డ్రాఫ్ట్ జాబితా ప్రచురితమైందని, క్లైమ్స్, అభ్యంతరాలకు ఈ నెల 22వరకు అవకాశముందని తెలిపారు. మార్పులు చేర్పులకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించుకోవాలని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈనెల 20, 21 తేదీలలో అన్ని కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌గా నిర్వహించనున్నట్లు చెప్పారు. సెంటర్లలో ఓటరు జాబితాతో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని, కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ నగేష్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులు అందజేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్ లో వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు తమ నెట్ ప్రాఫిట్ లో రెండు శాతం సీఎస్ఆర్ నిధులు ఇవ్వాల్సి ఉంటుందని, ఇప్పటివరకు ఎంత ఇచ్చారో నివేదికను అందించాలని ఆమె సూచించారు.

అలాగే.. గణతంత్ర వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను సర్వం సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేడుకల్లో పాల్గొనే వారి కోసం సీటింగ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఆదేశించారు.

అవగాహన ర్యాలీ

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఇన్‌స్పెక్షన్ బంగ్లా నుంచి పాత బస్టాండ్ వరకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, యువత, కళాకారులతో ఓటరు నమోదు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, డీఆర్‌ఓ నగేష్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం


బోర్ మోటార్ వద్ద నిర్మల, నాయకులు

కొండాపూర్(సంగటారెడ్డి): గత ప్రభుత్వం ప్రజల దాహార్తిని తీర్చడంలో విఫలమైందని, తండాల్లో తాగునీటి కోసం అల్లాడుతున్నారని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారాం కుంట తండాలో ఆమె తన సొంత నిధులతో బోర్ మోటార్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గెలిచినా, ఓడినా నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.ప్రభు, విజయభాస్కర్ రెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మీకిషన్, అనిల్, కుమార్ పాల్గొన్నారు.

ఖేడ్ ట్రాన్స్‌కో ఏఈ సస్పెన్షన్

నారాయణఖేడ్ : ఖేడ్ ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ సస్పెండ్ అయ్యాడు. ఆయన గతంలో కూకట్‌పల్లి, హౌసింగ్‌బోర్డు పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఏడీఈ నాగేంద్రకుమార్ తెలిపారు. కల్హేర్ మండల ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న వి.నారాయణకు ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

మట్టి గుట్టలు మాయం!

- ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా తవ్వకాలు
- వ్యాపారంతో కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు


మాసానిపల్లి శివారులో మట్టిని తరలిస్తున్న వాహనాలు

జోగిపేట(అందోల్): అనుమతుల్లేవ్.. అడిగేటోళ్లు లేరు.. ఇంకేముంది గుట్టలను తవ్వేస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే మట్టిని దోచుకెళ్తున్నారు. ఇలా అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అందోల్, చౌటకూరు మండలాల్లోని గ్రామాల శివారులో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం మట్టి తవ్వకాలు చేపట్టి వాహనల ద్వారా తరలిస్తున్నారు. అందోలు మండలంలోని మాసానిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో నుంచి అందోలు మున్సిపాలిటీ, సంగుపేట గ్రామాలలోని వెంచర్లకు పంపిణీ చేస్తున్నారు. రెవెన్యూ పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని తవ్వి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు.

పైసా వసూల్..

మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నారు.

అనుమతి లేకుండా తవ్వకాలు

మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా దందా సాగిస్తున్నారు. అందోలు మండలం పరిధిలోని మాసానిపల్లి, సంగుపేట, సరాఫ్‌పల్లి, సుల్తాన్‌పూర్ ప్రాంతాల నుంచి మట్టి గుట్టలను విచ్చలవిడిగా తవ్వకాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. గుట్టల తవ్వకాలకు రెవెన్యూశాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇచ్చిన అనుమతి మేరకు మైనింగ్ శాఖకు పన్ను చెల్లించాలి. క్యూబిక్ రూ.42 చొప్పున చెల్లించాకే మట్టి తవ్వకాలు జరపాలి. కానీ ఇవేవి అమలు కావడం లేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



మట్టి అక్రమ రవాణాపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. వీఆర్‌ఓ, వీఆర్‌ఏల వ్యవస్థ లేకపోవడంతో ఇలాంటి ఆరోపణలపై తహసీల్దారు, నేను స్వయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మట్టి రవాణాకు సంబంధించి అనుమతులు ఇచ్చే అధికారం రెవెన్యూశాఖకు లేదు. కేవలం అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం. అక్రమ దందాపై రెవెన్యూశాఖ అధికారులకు సంబంధాలున్నట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవం.
– పాండు, ఆర్డీఓ అందోలు

అక్రమ తరలింపు..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని 1002 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు రాత్రి సమయంలో మట్టిని తరలిస్తున్నారని బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగధ్వా యన మాట్లాడుతూ.. ఊట్ల గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాలును నిర్మించేందుకు ఈ మట్టిని తరలిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

సత్వర సేవలు.. అభినందనీయం

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: పోక్సో, లైంగిక కేసుల్లో వేధింపులకు గురైన బాధితులకు సత్వర సేవలు అందించడం అభినందనీయమని అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలోని భరోసా సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెంటర్‌లో పెండింగ్ ఉన్న అంశాలను త్వరగా పూర్తి చేయాలని త్వరలో సీపీ రివ్యూ నిర్వహిస్తారన్నారు. అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డుకు ఎంపికైన విఘ్నేశ్

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఇంటింటా ఇన్నోవేటర్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనట్లు టీచర్ అశోక్ కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి విఘ్నేశ్ కుమార్ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులు, వయోవృద్ధులు ఇబ్బంది పడకుండా వేసుకునేందుకు చొక్కా తయారు చేశాడని తెలిపారు. గతేడాది ఆగస్టు 15న మెదక్‌లో జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ప్రదర్శించగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా విఘ్నేశ్‌కు నాగ్సాన్‌పల్లిలో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో యాదగిరి మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): ఒక వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రంగంపేట గ్రామ శివారు మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కొల్చారం ఎస్‌ఐ గౌస్ తెలిపిన వివరాలు ప్రకారం మెదక్ నుంచి సంగారెడ్డికి బయలుదేరిన సంగారెడ్డి డిపోకు చెందిన అద్దె బస్సును, జోగిపేట వైపు నుంచి బైక్‌పై వస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన పిట్ల యాదగిరి(42) ఎదురుగా వెళ్లి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో ఏడాది జైలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్) గ్రామానికి చెందిన బోయిని వంశీకి పోక్సో కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.1,100ల జరిమానా విధిస్తూ శనివారం ఫస్ట్ అడిషనల్ జిల్లా క్లాస్ కోర్టు జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం హుస్నాబాద్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక తనను బోయిని వంశీ మానసికంగా, శారీరకంగా హింసించాడని గత నవంబరు 6న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ దాస సుధాకర్ కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తర్వాత ఎస్‌ఐ విచారణ పూర్తిచేసి నిందితుడిని జిల్లా పోక్సో కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో జడ్జి వంశీకి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1,100ల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మహేశ్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శివప్రసాద్, రాజమల్లును సీపీ అనురాధ అభినందించారు.

నష్టాల పాలు

పాడి రైతులకు ప్రోత్సాహకం కరువు

- లీటర్ పాలకు రూ.4 అందని వైనం
- జిల్లాలో రూ.5కోట్ల బకాయిలు
- 33నెలలుగా రైతుల ఎదురుచూపు
- మోయలేని భారంతో పశువుల అమ్మకం
- కొత్త ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

పాడి రైతులకు ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వం నుంచి ఆదరణ కరువై వారు ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక చేయూతను అందించడానికి గత ప్రభుత్వం ప్రత్యేకంగా రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టినా, వాటికి నిధులు సకాలంలో విడుదలకాకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోంది. ఫలితంగా వ్యవసాయ అనుబంధరంగమైన పాడి రైతులు నష్టాల పాలవుతున్నారు. ఒక వైపు పెరుగుతున్న ధరలతో పశుపోషణ మోయలేని భారంగా మరింది. జిల్లాలోని రైతులకు ప్రభుత్వం కోట్ల బకాయిలు పడింది. ఆ నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు.

– వట్‌పల్లి(అందోల్)





జిల్లాలో పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం అందించాల్సిన లీటర్‌కు రూ.4 ప్రోత్సాహక బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోతున్నాయి. పాడి రైతుల నుంచి పాలసేకరణ జరిపే డెయిరీల్లో ప్రభుత్వరంగ విజయ డెయిరీనే ప్రధానం. నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్ పాల శీతలీకరణ కేంద్రాల పరిధిలో జిల్లాలోని 158 పాడిరైతు సహకార సంఘాల కేంద్రాల ద్వారా 4,892 మంది పాడి రైతుల నుంచి నిత్యం 16,233 లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ డెయిరీ విజయపాల ఉత్పత్తిదారులకు మూడేళ్లుగా ప్రోత్సాహం అందకపోవడంతో సంగారెడ్డి జిల్లాలోనే రూ.5 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

33 నెలలుగా ఎదురుచూపులే..

పాడి రైతులను ప్రోత్సహించడానికి లీటరుకు అదనంగా రూ.4 ప్రోత్సాహాన్ని అందిస్తామని గత ప్రభుత్వం చెప్పడంతో పాడి రైతులు సంతోషించారు. చెప్పిన విధంగానే ఆలస్యమైనప్పటికీ 2020 ఏప్రిల్ వరకు మాత్రమే చెల్లించి చేతులెత్తేశారు. అప్పటి నుంచి దాదాపు 33 నెలలుగా ప్రోత్సాహం అందించడం లేదు. దీంతో చాలా మంది పాడి రైతులు పోషణభారం మోయలేక పశువులను విక్రయించుకున్నారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

పాడి పశువుల ధరలతోపాటు పశుగ్రాసం సాగు వ్యయం, దాణ, పోషణ, వైద్యం ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరిగి ఏమాత్రం గిట్టుబాటు కాని పరిస్థితి. మరో గత ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు విడుదల చేయకపోవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. దాదాపు 20 వేలకు పైగా మంది రైతులకు రూ.5కోట్ల ప్రోత్సాహకం అందకుండా పోయింది. కొత్త ప్రభుత్వమైనా పాడి ప్రోత్సాహక బకాయిల నిధులను విడుదల చేస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

డైయిరీ ఎండీని కలిసిన పాడి రైతులు..

పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న రూ.4 ప్రోత్సాహక నిధులను విడుదల చేయాలని కోరుతూ ఇటీవల ఆయా జిల్లాలకు చెందిన పాడిరైతులు విజయ దయిరీ ఎండీ ఇట్టెం లక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. పాల బిల్లులు కూడా సకాలంలో అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు పేర్కొనగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని రైతులు చెబుతున్నారు.



విజయడైరీ ఎండీ ఇట్టెం లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

బిల్లులు అందజేయాలి



ప్రభుత్వం ప్రకటించిన రూ.4 ప్రోత్సాహక నిధులు చెల్లించక 33 మాసాలు అవుతోంది. దీని వల్ల పాడి రైతులు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పాడి రైతుల ఇబ్బందులు తీర్చాలి. ప్రతి నెలా ఇచ్చే బిల్లులు కూడా ఒక్కమాసం పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రతి నెలా రెగ్యులర్‌గా వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– యాదగిరి, పాడిరైతు జోగిపేట బీఎంసీ

ప్రతిపాదనలు పంపించాం

విజయడెయిరీకి పాలు విక్రయించే రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. రూ.4 ప్రోత్సాహానికి సంబంధించిన డేటాను ఈ ల్యాబ్‌లో నమోదు చేస్తున్నాం. కొత్తగా విజయడైయిరీకి పాలుపోసే రైతులను కూడా ఈ ల్యాబ్‌లో ఎంట్రీ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

– రంజిత్‌కుమార్, జోగిపేట బీఎంసీయూ మేనేజర్

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం

- సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదు
- స్టేషన్‌లో సమాచారం అందించాలి
- పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ



డాక్టర్ అనురాధ, సిద్దిపేట పోలీసు కమిషనర్

సిద్దిపేటకమాన్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని సొంత గ్రామాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. వారి వివరాలు నమోదు చేసుకుని ఆయా ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఊర్లెళ్లేవారు తమ ట్రావెల్ వివరాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయకూడదని సూచించారు. తమ కాలనీలు, ఇళ్ల పరిసర ప్రాంతాలు, షాపింగ్ మాల్స్, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆరు బయట పార్క్‌చేసే వాహనాలకు హ్యాండిల్ లాక్ చేసుకుని, తగిన భద్రత ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అనుమానితులు, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. దగ్గర్లోని పోలీసుస్టేషన్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఊర్లెళ్లే వారు తమ విలువైన వస్తువులు, నగలు, నగదు ఇంట్లో ఉంచవద్దని సూచించారు. ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటించి దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూం 87126 67100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ముచ్చటగా మూడోసారి..

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయికి
- ఢిల్లీలో చాటిన హుస్నాబాద్ ఘనకీర్తి

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు హుస్నాబాద్ మున్సిపాలిటీ ముచ్చటగా మూడో సారి ఎంపికైంది. 2021లో మొదటిసారిగా ఫాస్టెస్ట్ మూవర్స్ సిటీ జాతీయ స్థాయిలో ప్రథమర్యాంక్ వరించింది. 2022లో దిబెస్ట్ సిటీ ఇన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. 2023 సంవత్సరానికి గాను సౌత్‌జోన్‌లో క్లీనెస్ట్ సిటీలో 3వ స్థానం దక్కింది. ఇప్పటికే ఓడీఎఫ్ ప్లస్‌తో హుస్నాబాద్ ముందు వరుసలో ఉంది. డోర్ టూ డోర్ చెత్త సేకరణ, తడిపొడి చెత్త వేరుచేసే విధానం, పొడిచెత్త, తడిచెత్త సేకరణ, సేంద్రీయ ఎరువుల తయారీ, వార్డుల వారీగా స్వీపింగ్, పబ్లిక్ టాయిలెట్‌ల వినియోగం, సిటీ వాయిస్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ వంటి అంశాలను పరిగణంలోకి తీసుకొని స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక చేస్తారు. సర్వేక్షణ్ కమిటీ సభ్యులు హుస్నాబాద్ పట్టణంలో సర్వే నిర్వహించారు. 2023లో దేశంలోని అన్ని పట్టణాలతో పోటీపడగా దక్షిణ భారత దేశంలో 15వేల నుంచి 25వేలలోపు జనభా గల పట్టణాల్లో హుస్నాబాద్ మున్సిపాలిటీకి క్లీనెస్ట్‌సిటీ విభాగంలో 3వ స్థానానికి ఎంపిక చేశారు. 9500 మార్కులకు గాను 6052 మార్కులు సాధించి హుస్నాబాద్ జాతీయ స్థాయి సౌత్‌జోన్‌లో మూడో స్థానానికి ఎంపికైంది.



ఎరువును తయారుచేసే విధానాన్ని పరిశీలిస్తున్న ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్

ప్రజల భాగస్వామ్యంతోనే..

హుస్నాబాద్ మున్సిపాలిటీ మూడోసారి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని, ప్రజల భాగస్వామ్యంతోనే మంచి గుర్తింపు వచ్చిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆనందం వ్యక్తం చేశారు. మరెన్నో అవార్డులు రావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాం.

దేశాభివృద్ధిలో విద్యనే కీలకం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దేశాభివృద్ధికి విద్యనే కీలకమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైశ్యభవన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్మా నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మంచి మార్పులు వస్తాయన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆ యాజమాన్యాలకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ట్రస్మా జిల్లా, నియోజకవర్గ బాధ్యులు మాలె రమేశ్, రేపాక విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

అనాథలైన చిన్నారులు

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

చిన్నశంకరంపేట(మెదక్): అనారోగ్య సమస్యతో తల్లితండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. నార్సింగికి చెందిన దంపతులు తమ్మారెడ్డి బాల్‌రెడ్డి, సుప్రియ అనారోగ్య సమస్యలతో ఒకరి తరువాత ఒకరు మృతి చెందారు. ఐదేళ్ల క్రితం బాల్‌రెడ్డి మృతి చెందగా, రెండు రోజుల క్రితం సుప్రియ మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు చిన్నారులు వినూత్న, సాత్విక అనాథలయ్యారు. తల్లితండ్రులను కోల్పోయిన బాలికలు పెద్ద దిక్కును కోల్పోయి బిక్కుబిక్కుమంటున్నారు. వినూత్న మెదక్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. సాత్విక సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే సంక్షేమ గురుకులంలో ఏడోతరగతి చదువుతోంది. ఆ బాలికలు తమకు దాతలెవరైనా సహాయం చేయాలని కోరుతున్నారు. ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 3000853971కు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.



వినూత్న, సాత్విక

ప్రత్యేక ఓటరు జాబితా..

- రంగం సిద్ధం చేసిన అధికారులు
- స్వీప్ క్యాలెండర్ రూపకల్పన
- నేటి నుంచి 22 వరకు నిర్వహణ

నారాయణఖేడ్: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక ఓటరు జాబితా నమోదు, సవరణకు జిల్లా అధికారులు వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. అందుకు స్వీప్ క్యాలెండర్‌ను రూపొందించి గ్రామాల్లో కచ్చితంగా అమలు చేయాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈనెల 22వరకు ఓటరు నమోదు చేపట్టాలని కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా శనివారం నుంచి ప్రతీ గ్రామంలోను, వార్డుల్లోను గ్రామసభలు నిర్వహించి ఓటరు జాబితా చదవడం, నూతన ఓటర్ల నమోదు, రంగోలీ పోటీలు నిర్వహించనున్నారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో యువ ఓటర్లు, విద్యార్థులతో 2కే రన్, బైక్, సైకిల్ ర్యాలీలు చేపట్టనున్నారు. నియోజకవర్గ కేంద్రాలలో యువత, ఎన్‌జీఓలతో కలిపి 12, 13 తేదీల్లో గాలిపటాల పండుగను నిర్వహిస్తారు. 17న ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్ల ప్రదేశాలను సందర్శించి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తారు. 18న కళాశాలల్లో విద్యార్థులను కలిసి యువ ఓటర్లుగా నమోదు చేయిస్తారు. 19లోపు స్పెషల్ ఎస్‌హెచ్‌జీ, జిల్లా, మండల సమాఖ్యలతో సమావేశాలు నిర్వహించి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తారు. అలాగే సీనియర్ సిటిజన్లు, కార్మికులకు అవగాహన కల్పిస్తారు. స్వీప్ నోడల్ అధికారులు షెడ్యూల్ ప్రకారం కార్యకలాపాలు చేపట్టాలంటూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు.

22 వరకు నమోదు..

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డిసెంబరు 20 నుంచి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల సవరణ చేపట్టారు. బూత్ స్థాయి అధికారులు(బీఎల్వోలు) ఇంటింటికీ తిరిగి 5వ తేదీ వరకు దరఖాస్తులు, సవరణల వివరాలు సేకరించారు. జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఈ నెల 22 వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉండగా ఎన్నికల సంఘం కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదు, ఫారం-7 ద్వారా తొలగింపు, ఫారం-8 ద్వారా మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. 1 జనవరి 2024కు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. దానికి పోలింగ్ బూత్ లేదా సీఈవో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు ఏప్రిల్-1, జూలై-1, అక్టోబర్-1 నాటికి 18 ఏళ్లు నిండనున్న వారు సైతం ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. వారికి 18 ఏళ్లు నిండాకే జాబితాలో చోటు కల్పిస్తారు.

తప్పులు తొలగేనా..

గత శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో పలు చోట్ల ఓట్లు గల్లంతు కావడం, మృతి చెందినా, జిల్లా నుంచి బదిలీపై వెళ్లిపోయిన ఉద్యోగుల పేర్లు జాబితాలో కన్పించడం, స్థానికంగా ఉండి, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నా జాబితాలో పేర్లు లేకపోవడం లాంటి సంఘటనలు వెలుగు చూశాయి. ఈ సారైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం



ఈ నెల 22 వరకు కొత్తగా ఓటరు నమోదు చేయడం, పేర్ల తొలగింపు, మార్పులు చేర్పులకు అవకాశం ఉంది. 20, 21వ తేదీల్లో గ్రామాల్లో స్పెషల్ క్యాంపెయినింగ్ బూత్ స్థాయిలో నిర్వహిస్తాం. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా రంగోలి, 2కే రన్ తదితర కార్యక్రమాలు ఉన్నాయి. స్వయం సంఘాల గ్రూపులతో పండగ తర్వాత సమావేశాలు నిర్వహించి వందశాతం ఓటరు నమోదు జరిగేలా చూస్తాం.

– వెంకటేశ్, ఆర్డీఓ, నారాయణఖేడ్

చెత్తగా.. తరలింపు..

పట్టణంలోని చెత్తను తరలించడంలో కనీస నిబంధనలను పాటించడం లేదు. ట్రాక్టర్ ట్రాలీ వెనుక డోర్ కూడా లేకుండా చెత్తను తరలిస్తున్నారు. దీనివల్ల ఆ చెత్తా చెదారం వాహనదారులపై పడి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



సైబర్ వలలో ఉద్యోగి

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- రూ.1.12 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ ఉద్యోగి రూ.1.12 లక్షలు పోగొట్టుకున్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి జనవరి 7న టెలిగ్రామ్ ద్వారా పార్ట్‌టైం జాబ్‌కు చెందిన మెసేజ్ వచ్చింది. దానికి స్పందించిన ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్‌చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు దపదపాలుగా మొత్తం రూ.1.12 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని బాధితుడు అడగగా నేరగాడు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పైనుంచిపడి వ్యక్తి మృతి



కిష్టయ్య(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): ప్రమాదవశత్తు బైక్ నుంచి పడిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గౌతాకల్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్తివాడ కిష్టయ్య(45) గురువారం మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో బంధువులకు చెందిన అంత్యక్రియలకు హాజరై స్వగ్రామానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు బైక్ నుంచి పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గ మధ్యమంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలుకిందపడి..

తూప్రాన్: రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బ్రాహ్మణపల్లి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. బ్రాహ్మణపల్లికి చెందిన ఎరుకల యాదగిరి(40) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

హత్యకేసులో భర్తనే సూత్రధారి

ఇద్దరు నిందితుల అరెస్టు

నారాయణఖేడ్: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అంజుమ్‌బేగం కేసు మిస్టరీ వీడింది. భర్తనే హత్యకు సూత్రధారిగా తేలింది. సీఐ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఈత్వార్‌పేట్‌కు చెందిన సయ్యద్ యూనుస్‌కు భార్య ఉండగా అంజుమ్‌బేగం(30)ను రెండో వివాహం చేసుకుని ఖేడ్‌లోని అద్దె ఇంట్లో ఉంచాడు. ఈనెల 8న ఆమె అద్దె ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరపగా హత్యగా తేలినట్లు సీఐ వివరించారు. మొదటి భార్యను సొంత ఇంట్లో ఉంచి తనను మాత్రం అద్దె ఇంట్లో ఉంచడం, అలాగే ఆస్తిలో సగం వాటా కావాలని ఆరు నెలలుగా అంజుమ్‌బేగం తన భర్త యూనుస్‌తో గొడవ పడింది. దీంతో తనకు ప్రశాంతత లేకపోగా చంపేస్తే ఆస్తి ఇచ్చే పరిస్థితి తప్పుతుందని యూనుస్ ఈనెల 6న తన అన్న కుమారుడైన అయూబ్‌తో కలిసి ఆమెను చంపాలని పథకం రచించాడు. ఈనెల 8న మధ్యాహ్నం అయూబ్ తన స్నేహితుడైన మరో మైనర్‌తో కలిసి అంజుమ్‌బేగం ఇంటికి వెళ్లాడు. బయట మైనర్‌ను ఉంచి అయూబ్ ఇంట్లోకి వెళ్లి బెడ్‌రూంలో ఉన్న అంజుమ్‌బేగంపై దాడి చేశాడు. ఆమె కిందపడిపోగా బెడ్‌రూం నుంచి వంటగదిలోకి లాక్కునివచ్చి ఫ్లోరింగ్ క్లీన్‌చేసే పరికరం ప్లాస్టిక్‌వైపర్‌తో తలవెనుక గట్టిగా కొట్టడంతో ఆమె మృతిచెందింది. ఆ విషయాన్ని ఫోన్‌లో చెప్పగా యూసుఫ్ వారిని బీదర్‌కు పారిపొమ్మని చెప్పాడు. ఈ క్రమంలో పోలీసులు శుక్రవారం నిందితులను పట్టుకుని కోర్టుకు హాజరుపర్చారు, కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి